సీతమ్మకి ఉత్తరాలు

01-01-2000 9:09AM

ఎక్కడున్నా ఏ పరిస్థితిలో ఉన్నా నాతో ఎప్పుడూ తోడు ఉండేది నా నిద్ర, అలాంటిది దాన్ని దాటుకుని ఎన్నో ఆలోచనలు వరుసగా మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.

కట్టుకుంటున్న కొత్త ఇల్లు, వుండటానికి సొంత ఇల్లున్నా ఇలా ఒక రోజు జైల్లో పడుకుంటానని, బతకడానికి వ్యాపారం, కుటుంబం అన్నీ తాపీగా సాగిపోయే జీవితంలో కేవలం రెండే రోజుల్లో ఇరుక్కుపోతానని ఎప్పుడూ అనుకోలేదు.. కొత్త శతాబ్దం కోసం ఎన్నో ఆశలు, ఆగ మేఘాల మీద వేసుకున్న ప్లాన్లు, కలలు అన్నిటికీ అనుకోనంత అనుభవంతో ఎదురు వచ్చేసింది, ఈ రెండు రోజుల్లో.

ఉన్న బరువులన్నీ దింపేసుకున్న నా ఆనందం, అవసరమేలేని కథలన్నీ మోసుకుంటూ మొదలుపెడుతున్నా.....

ఎప్పుడేప్పుడు బయట పడతాననో? నాలో నిండి ఉన్న కథకి అంతం ఏంటి? ఎన్నో ప్రశ్నలు, ఎన్నో చెప్పాలనుకునే మాటలు? కానీ ఎవరికి చెప్పాలి? ఎలా చెప్పాలి? తెలిసో, తెలియకో నన్ను కదిలించిన మనిషి ఏమయ్యాడు? ఎలా చనిపోయాడు?-

ఆలోచిస్తుంటే అన్ని విధాలా నిద్ర దూరమైంది. ఏదో చేయాలన్న ఆత్రం ఏం చేయలేని నిస్సహాయత కట్టి పారేసింది. నాలుగు గోడల మధ్య తెలిసిన ప్రపంచమంతా తిరుగుతూ, ఇది కచ్చితంగా అందరికి చెప్పాలి అనుకున్నాడు.

డిసెంబర్ 29 1999 3:25 PM

# 1. సాహసం

అందమైన వెన్నెల వన్నెల వాగులలో,
కన్నుల మిన్నుల కాంతులతో,
నరాలు నొక్కి పెట్టే గాలులతో
దూరంగా సముద్రంలో ఆకాశం తాకుతున్న చెట్టు,
వెనకాల సగం తొంగిచూస్తున్న చంద్రుడు,
పొగ మంచు చీల్చుకుంటూ పడవ ప్రయాణం— ఓ మధురానుభూతి.
ఇంతలో ఏదో తెలియని అలికిడి...

"ఏవండీ! ఏవండీ! లేవండి ఎంతసేపు పడుకున్నా మీకు మొద్దు నిద్ర ఆగదు. అబ్బా లేవండి! సాయంత్రం కావస్తుంది, లేవండి ఈలోపు కాఫీ తెస్తా."

"నీ తలకమాసిన చాదస్తం తగలెట్టా, కాసేపు కునుకు పడితే కుళ్ళుకుంటావ్ మంచి కల చెడగొట్టావ్. కాసులు పోసినా ఇంత అందమైన కల చూడలేమే పిచ్చిదానా"

"పోనీ మళ్ళా పడుకోలేకపోయారా! ఈసారి ఇంకా బాగా వస్తుందేమో!" అంది.

"ఇదేమైనా సగంలో ఆపేసిన పనా? మళ్ళీ మొదలుపెట్టడానికి. ఎంత ఖర్చు చేసినా రానివి కూడా దేవుడు ఫ్రీగా ఇస్తుంటే.." అంటూ విసుగ్గా లేచాడు సూర్యం.

"అబ్బో! తేనేర్పు వచ్చేలా తిని పడుకుంటే ఇప్పుడు ఏంటి ఎప్పుడైనా వస్తాయి కలలు, ముండ నిద్ర అదేదో మంచం మీ చుట్టం అన్నట్టు పడితే లేవరు" అంది.

ఒళ్ళు విరుచుకుంటూ "నీకు తెలుసుగా దేవి నాకు నిద్ర ఎంత ఇష్టమో!" అంటూనే తిరిగి పడుకోడానికి ప్రయత్నించాడు. 'రోజూ తిరిగే గడియారం ఒక్క గంట సేపు ఆగిపోతే బావుండు,

ఎక్కువ సేపు పడుకోవచ్చు.. ఆగేదేదో ఒక్క రోజు ఆగినా మంచి ప్రశాంతంగా ఏ పని పాటా లేకుండా పీకలదాకా తిని చెట్ల కింద గురుక పెట్టి పడుకోవాలని వుందే.

ఆలోచిస్తే కుంబకర్ణుడి వారసత్వం గాని నాలో వుందేమో?' అనుకుంటూ చల్లగా గాలి తగలగా దుప్పటి కప్పుకుని నిద్ర దేవత తపస్సులోకి వెళ్ళేలోగా ఎన్నో ఆలోచనలు.

ఎందుకు నిద్ర రాట్లేదు, ఎందుకు నిద్ర బదులు ఇన్ని ఆలోచనలు కుప్పలు తట్టలుగా ఆనకట్ట లేనట్టు ముంచుకు వస్తున్నాయి, ఒక విధంగా మంచిదే కొంతమందికి అయితే ఉన్నా పని చేయదు. అయినా ఆలోచించటం మానేయాలి.

ఏంటిలా తయారయ్యాను ఆలోచించకూడదని ఇన్ని ఆలోచిస్తున్నా. యోగా చేయాలి, అలా చేస్తే ఇలా ఆలోచనలు అసలు రావని వీధి చివర తాతగారు చెప్పారు.

ఆలోచిస్తూ చిన్నగా నిద్రలోకి జారుకున్నాడు, పడుకున్నా కూడా మెలకువ మంచం అంచున కాచుకుని కూర్చొంది. ఏదో కల వచ్చిందో లేదా ఊహా? అది కూడా తెలీదు మొఖంలో చిన్న మందహాసంతో నవ్వాడు. అంతలో కంగారుగా–

"ఏవండీ! మీ నిద్ర పాడుగాను లేవండి! అబ్బా లేవండి ముందు మీరు"

"బ్రిటిష్ సైన్యమంతా ఇంటిమీద దండయాత్ర చేసినట్టు, ఏంటి ఆ కంగారు.? నిన్ను మీ పుట్టింటికి కొన్ని రోజులు పంపిచేసి సుఖంగా కునుకు తీయాలి. తెలుసుగా రెండు మూడు రోజులుగా శ్లాబ్ పనులు అవుతూనే ఉన్నాయి, ఒంట్లో సుఖంగా ఉంటేనేగా ఇల్లు సుఖంగా వుంటుంది." కోపంలో చిరాకుగా కేకలు వేశాడు.

"సుఖం కావాలంట! అదిగో మీ మదన్ వచ్చాడుగా వెళ్ళండి బాగా ఇస్తాడు మీకు కావలసినంత! వెళ్ళండి"

'వీడు ఎందుకు తగలడ్డాడు ఇప్పుడు?' అనుకుంటూ.. మదన్ మా అందరిలోనూ బాగా డబ్బున్నవాడు, తాతల ఆస్తితో పాటు తెలివిగా వ్యాపారాలు చేస్తూ రెండు కాదు.. కాదు.. వాళ్ళ ఆవిడతో కలిపి నాలుగు చేతులా సంపాదిస్తున్నాడు.

పని పాటా లేకుండా ఊర్లు తిరగటం, వాటి గొప్పలు చెప్పుకోవటం. 'బ్రతుకంటే వీడిదే' అని అనుకోని రోజు వుండదు గుర్తొస్తే, కానీ గుర్తు పెట్టుకునేంత మంచి పేరు కాదు. ఒకసారి 'సాహసం చేద్దాం ఢింభకా' అని అందరినీ ట్రెక్కింగ్ అనే పేరుతోఎత్తైన కొండ పైకి కాలినడకన ఎక్కించాడు. ఆ నొప్పులు తట్టుకోవడానికి 15 రోజులు పట్టింది. అసలు సంపాదనే అవరసంలేని సోంబేరని ఎగతాళి చేస్తూవుంటాం.

"వొద్దురా! లాగొద్దు నేనే వస్తున్నాగా" అన్నా వినకుండా లాక్కుని వస్తున్నాడు మదన్. హాల్లోకి వెళ్ళగానే గట్టిగా అరిచాడు సూర్య. ఇల్లంతా అదిరింది,

దేవి టక్కున వంటింటి వాకిలిలోంచి తొంగి చూసింది.

"ఏరా ఎప్పుడు వచ్చావ్ ఆస్ట్రేలియా నుంచి, మనం కలిసి సుమారు ఐదు, ఆరు ఏళ్లు అయిందా? చాలా ఆనందంగా ఉందిరా పావలా నిన్ను చూసి."

"వచ్చి రెండు రోజులైంది, నువ్వు ఇక్కడ లేవేమో అనుకున్నా, వీడిని కలిస్తే ఉన్నావని తెలిసింది" అన్నాడు పవన్.

"ఎందుకు వుండను చెప్పు, ఇక్కడే పొలం కొన్నాను, స్థలం కొన్నాను, ఇంటి పనులు అవుతున్నాయి.. ఇక్కడే స్థిరపడాలి, ఎక్కడికి పోతాను. ఇక నుంచి ఇక్కడే" అన్నాడు సూర్య.

"ఏమో దొరగారు, నేను వచ్చినప్పుడు మీరు వుండరు, నువ్వు వచ్చినప్పుడు నేను, కనీసం నా కూతురు పెద్దమనిషి ఫంక్షన్ ఇక్కడే ఉన్నా కూడా ఏదో సాకు నెత్తిన ఏసుకుని రావటం మానేసావ్" అని నిందించాడు పవన్.

"ఎంత మాట అన్నావ్ మిత్రమా? అడిగి చూడు ప్రాణం అయినా ఇవ్వనా నీకోసం, ఆ రోజంటే పని కుదరక రాలేదు, తర్వాత అలా చాలా చెప్పుకోలేని కష్టాలు పనులు అవన్ని ఇప్పుడు ఎందుకులేగానీ! నువ్వు చెప్పు!"

"రే పవన్! ఆడు కష్టాలు చెప్పటం స్టార్ట్ చేస్తే, చెవులు తుప్పు పడతాయి. చివరకి పోన్లే అని జాలి పడి ఆస్తి రాసిస్తావ్. ఇలా వచ్చేయ్" అన్నాడు మదన్.

"అందరికీ బాబుల ఆస్తి తేరగా రాదులే దొరా!" అన్నాడు సూర్య.

దేవి చల్లటి మజ్జిగ, పిండి వంటలు తెచ్చి అక్కడ పెట్టి,

"బావున్నారా అన్నయ్యా? చూసి చాన్నాళ్ళయింది" అని పలకరించింది.

దానికి పవన్ "బావున్నానండీ మీరు ఎలా ఉన్నారు?"

"నేను బావున్నాను అండి, సుజాత రాలేదా?" అంటూ మర్యాద చేసింది.

"వచ్చింది, పక్కన చుట్టాలు ఉంటే కనిపించి వస్తానని వెళ్ళింది వచ్చేస్తుంది."

"మమ్మల్ని ఎవరూ పలకరించరు కాబోలు?" అంటూ సాగతీశాడు మదన్.

"మీరు ఎవరో నాకసలు తెలీదు, తెలియని వారితో ఏం మాట్లాడటం మీరే చెప్పండి" అని నొక్కి చెప్పింది దేవి.

"సరేలే తెలియకపోయినా పర్లేదు! అక్కడ పెట్టిన చల్లగుత్తులు ఇలా అందుకోండి తిని పెడతాం"

ప్లేట్ అందిస్తూ "సర్ గారి గాలి మా మీద మళ్ళిందేంటి? సర్ బాగా బిజీ కదా! తీరిక ఉండదు అసలే మీకు.

"రే పవన్! వీడు ఇక్కడే ఉన్నాడన్న మాటే గానే సుద్దదండగ ఈడు, నువ్వు వచ్చావు గా న్యూ ఇయర్ బాగా ప్లాన్ చేద్దాం" అన్నాడు సూర్యం.

ఫక్కున నవ్వాడు మదన్ నోటి నిండా ఉన్న తిండితో, పవన్ ఇంతలో –

"ఇందాక వీడు ఏదో విచిత్రమైన ప్లాన్ చెప్పాడు రా" అన్నాడు పవన్. "ఏముంది ఏదో టూర్ అంటాడు, ఈసారి ఎటు బాబు? అన్నాడు సూర్య.

"మనమంతా కలిసి ఉండటం అంటా! ఏదో చెప్పాడు కానీ అర్థం కాలేదు" అన్నాడు పవన్. మదన్ సర్దుకుని "వాడు ఎలానో మూడు నెలలు ఇక్కడే ఉంటాడంట, ఈ వీకెండ్ మనతో ఉండకపోతే ఏం కాదు"

చిరాకుగా "ముందు నీకేం పనులు ఉన్నాయో చెప్పు" అన్నాడు సూర్య.

గడియారం వంక చూస్తూ, "గాడిద కంగారు నీదీను చెప్తా కదా! కాసేపు ఓపిక పట్టు" ఖాళీ ప్లేట్ ఇస్తూ "దేవి ఇంకొన్ని పట్రా" అని ఇచ్చాడు.

"ఒక కిక్ స్టార్ట్ ప్లాన్ రెడీ చేశా, అర్థమైతే ఆకాశమే కానీ మీకు అవకాశం లేదు, తప్పకుండా చేయాల్సిందే ఎందుకంటే నేను మీకు అవకాశం ఇవ్వనుగా" అన్నాడు మదన్.

"ముందు చెప్పు తర్వాత ఏం చేయాలో మేము చెప్తాంగా" అన్నాడు పవన్.

"ఇంతలో ఏదైనా మీరు ఆనందంగా వెళ్ళి వచ్చేయ్యండి, నాకు ఒకప్పటిలా ఓపిక అసలు లేదు, దానికి తోడు మీరు కలిసిన ప్రతిసారి నాకే ఏదోక పెంట తెస్తారు,

నన్ను వదిలేయండి అసలకే నాలుగు రోజులుగా సరిగా నిద్రలేదు, కావాలంటే నీ మీద ఒట్టు రా మదన్" అని పైకి లేచాడు సూర్య.

"నువ్వు ఎన్ని దొంగ ఒట్లు ఏసినా నేను వందయేళ్లు బ్రతుకుతా నాకేం భయం లేదు" అన్నాడు మదన్.

"నువ్వుండరా! ప్రతిదానికి ముందే మంగళమంటావ్ ముసలోడైపోయాడు ఈడు" అన్నాడు పవన్.

"మీ బోంద! ముసలొడా? లుంగీ ఎగట్టి కబడ్డీ ఆడదాం రండ్రా, పోనీ రన్నింగ్ రేస్" అని లుంగీ పైకి లేపి ముందుకు వచ్చాడు సూర్య.

ఇంతలో సుజాత లోనికి వస్తూ టక్కున ఆగింది, కంగారుగా సూర్యం కూడా లుంగీ దించి "రండి రండి" అన్నాడు.

అందరికీ హలో చెప్పి, "అన్నయ్య గారు దేవి ఎక్కడ?" అంది.

"లోన వుంది వెళ్ళమ్మ" అనగానే చొరవగా తన ఇల్లులా వంటగది వైపు వెళ్ళింది.

"ఈడు మళ్ళీ ఎదవయ్యాడు, బోడి హీరోయిసమ్ ఎందుకురా నీకు, నువ్వేమైన చిరంజీవి అనుకుంటావా? లుంగీ చుడుతున్నాడు లుంగీ" అని వెక్కిరించాడు మదన్. చెప్తా మీ సంగతి చెప్తా అనుకుని కూర్చొన్నాడు సూర్య.

"మా ఆవిడ కూడా రావాలే ఇంకా రాలేదు" అన్నాడు మదన్.

“ముందే చెప్పాలి కదా వస్తున్నట్టు, రాత్రికి అందరం కలిసి ఇక్కడే డిన్నర్ చేద్దాం, చేప పురమాయిస్తా, తెలుసుగా మా మామ గారిదే చేపల చెరువు, పెద్ద చేపలు పడతాయి” అని డాబుగా చెప్పాడు సూర్య.

ఇద్దరు ఒక్కసారిగా “అబ్బో! వొద్దులే నాయనా మీ మామ గారి పెద్ద పెద్ద చేపలు” అని నవుకున్నారు.

“చుట్టాలు వచ్చినట్టు ఉన్నారు చూడు” అన్నాడు పవన్.

దూరంగా గేటు కాడ నుంచి ముగ్గురు నలుగురు లగేజ్ తో వస్తున్నారు. మదన్ సడన్గా నిలబడి “వచ్చేసింది మిత్రమా సమయం వచ్చేసింది, సిద్ధంగా ఉండండి” అంటూ వచ్చిన వాళ్ళని రిసీవ్ చేసుకుంటున్నాడు.

పవనూ, సూర్య ఒకరిని ఒకరు చూసుకుని..

సూర్య అయోమయంగా అడిగాడు “ఏంటి రా?”

పవన్ దానికి “నాకు సరిగ్గా తెలీదు ఆగు” అన్నాడు.

వచ్చినా వాళ్ళలో కొంత మంది సూర్యకి తెలిసినవాళ్లే.

మదన్ కాలర్ పట్టుకుని చిన్నగా గుంజి “బాబు రే! ఏంటి ఈ సంత?” అని చిన్నగా అడిగాడు సూర్య.

“ఒక్క పది నిమిషాలు ఓపిక పట్టు అన్నీ విపులంగా చెపుతాగా” అని వచ్చిన వాళ్ళతో మాట్లాడుతున్నాడు మదన్.అందరికీ సమయం మూడు ముల్లులతో నడుస్తుంటే– సూర్యకి మాత్రం అరముల్లులతో నడుస్తుంది, కానీ మెదడు మాత్రం ఆరు ముళ్ళతో తిరుగుతుంది.

చిన్నగా తెలిసిన వాళ్ళతో మాట కలుపుతూ ‘ఇప్పుడే వస్తా’ అని దేవికి– ‘జనాలు వచ్చారు కాఫీ పెట్టు’ అని బేగా వచ్చి కూర్చొన్నాడు. మళ్ళీ గేటు నుంచి ఇంకో రెండు జంటలు సంచులతో వస్తున్నారు. సూర్యకి ఏమర్థంకాలేదు, మళ్ళా దేవి దగ్గరకి వెళ్ళి ‘ఇంకో నాలుగు ఎక్స్ట్రా పెట్టు’ అన్నాడు.

దేవి, సుజాత ఇద్దరూ ఏమైంది అసలని బయటకి వచ్చి చూశారు. దేవి సైగ చేసి పిలిచింది. “ఎవరండీ అంతా?” అని అడిగింది,

"నాకేం తెలుసు ఉన్నాడుగా మనకో మూర్ఖుడు, ఆడి బృందమే ఇదంతా.

"మమ్మల్ని కూడా బ్యాగులు సర్దుకునే రమ్మనారు అన్నయ్య గారు" అంది సుజాత.

"ఏమోనమ్మ! ఆడా మాట వినడు, అసలే మీ ఆయన తింగరోడు మధ్యలో మేళం నాకు ప్రతిసారీ" అని ప్లేట్లో పిండి వంటలు తీసుకువచ్చాడు సూర్యం.

పవన్ పక్కన కూర్చుని "రే పవన్! ఏంటి అసలు మేటరూ ఇద్దరు తోడు దొంగలేగా ఏం ప్లాన్ చేశారు" అందరి ముందు నవ్వు నటిస్తూ అడిగాడు సూర్య.

"నాకూ తెలీదు, చెప్పినా నీకు అర్ధం కాదు, అర్థమయ్యేలా అందరం ఉన్నపుడు చెప్తా అన్నాడు రా"

"అంతేనా ఇంకేమైనా?"

"ఇంకా అంటే ఐడియా మాత్రం అద్భుతంగా ఉంటుందని చెప్పాడు"

"ఇలాంటి కొండాయిపాలెం ఐడియాలు కొండగాడికి కొత్తేం కాదు, ప్రతీదీ చివరి నిమిషంలో చెప్తాడు, ఏమైనా అంటే ఫ్రెండ్స్ అంటాడు. నువ్వు ఒక పెద్ద మొద్దువి, డైరెక్ట్ గా నా దగ్గరకి వచ్చేసివుంటే ఈ పిచ్చోడు తర్వాత వచ్చేవాడు" అంటూ.

చూస్తుండగానే హాల్ నిండింది. సూర్యం ఇంక అపుకోలేక "ఏంటి అందరూ లగేజ్ తో వచ్చారు కాశీ గాని వెళ్తున్నామా?" అని నవ్వాడు.

"ఏంటి కాశీ వెళ్తున్నామా?" అని గుంపులో గొంతుకి ఇంకో గొంతు "ఏమో మదన్ ఏ చెప్పాలని" జవాబు ఇచ్చారు.

దేవి కాఫీ అందరికీ ఇస్తుంది, సుజాత కూడా పక్కనే సాయం చేస్తుంది. మదన్ మాత్రం కాఫీ తాగుతూ, జేబు నుంచి పెన్ను, పేపరు తీసి చిట్టీలు చింపి ఏదో రాస్తూ సుజాత వంక చూసి "గాజు గ్లాస్ పట్రా నువ్వు" అని తన పనిలో పడాడ్డు. అలసిపోయున్న సూర్య 'వాడు ఏమైనా చేయని నేను మాత్రం ఈసారి కదలను వీళ్లంతా ఎంత త్వరగా వెళ్లిపోతే అంతా త్వరగా కాళ్ళు చాపి పడుకోవాలి, ఓ పక్క డబ్బులు లేవు ఎంత బొక్క పెడతాడో.

వీడసలు ఏమనుకుంటున్నాడని' రకరకాలుగా ఆలోచిస్తూ బలవంతంగా నవ్వుతుతో న్నాడు సూర్యం. చీటీలన్నీ రాసేసి పేపర్లు మడిచి పెడుతున్నాడు,

"రవి గారు రావాలి ఇంకా రాలేదు ఏంటి?" అన్నాడు మదన్.

ఇంక ఆగలేక "ప్రపంచంలో ఎక్కదున్నా నువ్వొక్కడివే ఎప్పుడు ప్రశాంతంగా వుండగలవురా, ఎందుకంటే పక్కనోళ్ల ప్రశాంతత కూడా నువ్వే తీసేసుకుంటావ్గా" అనగానే అందరూ ఒక్కసారిగా నవ్వారు.

"ఇందాక అన్నాడుగా వందయేళ్లు బతుకుతానని ఇందుకేనేమో" అని మాట సాయం చేశాడు పవన్. మదన్ మాత్రం తన పని తాను చేసుకుంటూ అన్నీ వింటున్నాడు, చేతి వేళ్ళతో లెక్కపెడుతూ "సరే అయిపోయిందని" పైకి లేచాడు.

"జీతం జీవితాన్ని మాత్రమే ఇస్తుంది, కానీ సాహసం అదే జీవితంలో ఆనందాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది. ఇప్పటిదాకా మనం ఎవరూ చేయని ఒక మంచి కాన్సెప్ట్ చెపుతా, ఆల్రెడీ ఇక్కడ కొంత మందికి తెలుసు, అయినా మళ్ళీ చెప్తున్నా ఎప్పుడూ ఏదోకటి కొత్తగా చేస్తూనే వుండాలి, పాత కొత్తకి, కొత్త రేపటికి మధ్యలో జరిగేవే 'milestones' అంటాం అందుకే కొత్త శతాబ్దం మరింత కొత్తగా స్టార్ట్ చేద్దాం" అన్నాడు.

"బాబు! మదన్ సూటిగా చెప్పేయ్, ఇటు చూశావా సూర్యం గారి మొఖం ఎలా ఎండిపోయిందో" అన్నాడు గుంపులో గంగాధరం.

ఓర చూపుతో మాట్లాడకుండా చూసి ఊరుకున్నాడు సూర్యం.

"లేటు ఎందుకు త్వరగా చెప్పు ఎక్కడికైనా ట్రిప్ ప్లాన్ చేశావా? హిల్ స్టేషన్లో పార్టీ ఏదైనా, లేదా ట్రూత్ ఆర్ డేర్ అన్నావ్ అదా? ఏదైనా పెద్ద ట్రిప్ కూడా ఓకే నాకు" అన్నాడు పవన్. "పెద్దపెద్దవి చాలా పాతవి, చిన్నచిన్నవే ఇప్పుడు కొత్త, శతాబ్దమే మారిపోతుంది మన ఆలోచనలు కూడా మారాలి కదా, కంగారేం పడకండి కాస్త విచిత్రంగా వుంటుంది గాని కొత్తగా వుంటుంది. సరే ఇంక చెప్పేస్తున్నా!" అని మదన్ సూర్యం వంక చూశాడు.

"హమ్మయ్య చెప్పరా నాయనా" అంది దేవి చొరవ తీసుకుని...

సూర్య మదన్ 'ఏం చెపుతాడో ఏంటో' అనుకుంటూ చూస్తున్నాడు.

"ఇప్పుడు ఈ చీటీ ఒకొక్కటి తీయండి, అందులో ఎవరి పేరు వస్తుందో వారు వాళ్ళ ఇల్లు వదిలేసి చీటీలో వచ్చిన వాళ్ళ ఇంట్లో రెండు రోజులు ఉండాలి. పేరు చూసుకున్న ఒక రెండు గంటలలోపు అన్నీ సర్దుకుని ఇంకో ఇంటికి వెళ్ళి ఉండాలి. ఆల్రెడీ వీళ్ళంతా ఒప్పుకుని లగేజ్ పట్టుకుని ఇక్కడికి వచ్చారు. అర్థమైందా అందరికీ? లేదా మళ్ళీ ఇంకోసారి క్లియర్ గా చెప్పమంటారా?" అంటూ మదన్ కాఫీ తీసుకుని కూర్చొన్నాడు.

అందరూ మొఖాలు చూసుకున్నారు, సూర్య మాత్రం అందరిని చూశాడు. బాణాన్ని తిప్పి కొట్టాలనుకున్నాడు సూర్య.

"చిన్న పిల్లడిలా మాట్లాడకు, ఇంతసేపు డప్పు కొట్టి డొక్కులో ఐడియా చెప్పావ్, నేను ఇంకా ఏదో గొప్పగా ఊహించుకున్న, నన్ను అడిగితే దీన్నీ తలతన్నే ఐడియాలు వంద చెప్తా" పవన్ వంక అంగీకారం కోసం చూశాడు, వాడి చూపులకి వచ్చిన ధైర్యంతో–

"ఇందాక నువ్వే కదా జీతం జీవితం సాహసం శాశ్వతమని సినిమా డైలాగ్లు కొట్టింది." అని వెక్కిరించాడు.

అందరూ గట్టిగా నవ్వటంతో సూర్యకి మరింత ధైర్యం వచ్చింది,

"మాట్లాడవేం? చెబుతావు కదా ఊర్లో సోదంతా ఇప్పుడు చెప్పు బాబు?"

మదన్ ఒక్కసారిగా గట్టిగా నవ్వటంతో బెలూన్ గాలి తీసేసినట్టు అయింది.

"సాహసం అంటే ప్రతిసారీ దేహానికేనా? కొండలు ఎక్కాలా, వాటర్ఫాల్స్ చూడాలా? అలిసిపోయేలా అన్ని ఊర్లు తిరగాలా? ఇది కూడా సాహసమే, కాకపోతే మానసిక సాహసం, సరదాగా ఆలోచించు ఇప్పుడు నువ్వు వేరే ఇంట్లో వున్నావ్, కూర వండాలి ఉప్పు ఎక్కడ వుందో తెలీదు, పప్పు, కారం, పచ్చి మిర్చి కోసం పిచ్చి కష్టాలు. ఒకవేళ రాత్రి కరెంట్ పోయిందనుకో కొవ్వొత్తి కోసం కుస్తీలు, దానికెన్ని కసరత్తులు చేయాలో, టీవీలో ఛానెల్ నెంబర్ ఏంటో? అన్నీ తికమకలే."

"ఏడిచినట్టుంది నువ్వు చెప్పింది, ఇలాంటి వంకర పనులెందుకు చక్కగా ఈ రెండు రోజులు కావాలంటే ఒకే చోట వుందాం" అన్నాడు సూర్య.

మదన్ సూర్యని ఆపుతూ–

"నన్ను కాస్త పూర్తి చేయనివ్వు, బాడీ ఒకరి ఇంట్లో మానసికంగా మనింట్లో. కొత్త ఇల్లు, కొత్త గది, కొత్త ఆవరణ అన్నీ కొత్త విషయాలు ఏదో తెలియని ఇబ్బంది. రాత్రిపూట నిద్ర పట్టచ్చు పట్టకపోవచ్చు. ఎప్పుడు ఉండే చోట కాకుండా కొత్త ప్లేస్ లో కొత్తకోణం, కొత్తకోణం లో కొత్త ఆలోచన, కొత్త ఆలోచనలో కొత్త అనుభూతులు, కొత్త అనుభూతుల్లో కొత్త శతాబ్దంలో కొత్తలోకం. విచిత్రంగా వుంటుంది కదా, ఏం అంటారు?" అన్నాడు మదన్ ఊహల్లో వుంటూ.

"మాకు అన్ని కొత్త కొత్త కోరికలు లేవమ్మ! ఈ పాత చింతకాయి బ్రతుకే మాకు చాలా ఎక్కువ నువ్వు వెళ్ళి ఎలా వుందో చెప్పు ఇందులో అంత గొప్ప ఏం ఉంది, కోరి కోరి రెండు రోజులు ఇబ్బంది  పడటం తప్ప.. నువ్వు ఎన్నైనా చెప్పు నాకు అయితే నచ్చలేదు, పవన్ గాడి ఫేస్ చూడు చెప్పలేకున్నాడు అంతే!" అని సూర్య చెప్పగానే అందరూ సైలెంట్ అయిపోయారు.

మదన్ కూడా "నన్ను నమ్మండి ఏదైనా మంచైనా, చెడైనా చేయనిది చేయటంలోనే మజా వుంది, ఆపై మీ ఇష్టం. సుబ్బారావ్ గారు మీరేం మాట్లాడరేంటి, ఆ రోజు అనుకున్నాంగా చెప్పండి" అన్నాడు..  "ఏరా పవన్ నువ్వు?"

"నాకు సరిగా అర్థంకాలేదు ఇది పిచ్చి పనా? లేదా మంచిదా? ఏం అర్థంకాలేదు, ఏదోలా వుంది ఎందుకు ఇదంతా అనేలా?"

మదన్ మొఖం కాస్త చిన్నబోయింది. సూర్యకి కాస్త తేలికైంది,"ఎందుకని న్యూ ఇయర్ ఐయ్యాక మనం చేయకూడదు, అంటే ఇంత సడన్ గా కాకుండా అందరం సిద్ధమయ్యి చక్కగా పద్ధతిగా వెళ్ళచ్చు కదా" అన్నాడు పవన్."అలా సడన్ గా వెళ్ళటమే కిక్కు, అందుకే మీకు ముందు చెప్పలేదు" అన్నాడు మదన్.

ఇంత వరకు కాస్త సున్నితంగా ఉన్న  సూర్యం మాట్లాడుతూ "చిన్న పిల్లాడు  ఐస్ క్రీమ్  కోసం ఏడిచినట్టు, అసలు అర్థం పర్థం లేకుండా మాట్లాడక, అయినా ఇలాంటి సలహాలు నీకే వస్తాయా లేక నీకో బ్యాచ్ ఉందా? పవన్ గాడు అన్నట్టు మళ్ళా చూద్దాం అందరి వీలు చూసుకుని పెట్టుకుందాం" అని–

మనసులో 'అప్పటి సంగతి అప్పుడు చూసుకుందాం' అనుకున్నాడు సూర్య.

సుబ్బారావ్ గారు లేస్తూ "అందరం ఉన్నాం మళ్ళీ అంతా అన్నా కూడా కష్టమే, అయినా ఎందుకంత బెంగ పడుతున్నారు రెండు రేయిలు కళ్ళు మూసుకుంటే ఇట్టే ఐపోతాయి, నేను ఇలానే ప్రతిదీ తర్వాత చూసుకుందాం, మళ్ళా చేద్దాం అనుకుంటూ అరవై దాటేశాయి. మదన్ బాబు చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది, చేద్దాం అనిపించింది. రెండో ఆలోచన లేకుండా వచ్చేశాను. చూడండి చేయటంలో తప్పేం కనిపించడం లేదు నాకు" అన్నారు. ఇంతలో గంగాధరం–

"అది కాదు మాస్టర్ గారు ప్రాబ్లం ఈ సూర్యం గారు ప్రతిదానికి ఎడ్డం అంటే తెడ్డం అంటాడు, భయస్థుడు కూడాను! ఓ పట్టాన ఒప్పుకోడు కదలడు, నేను అప్పటికి మదన్ గాడికి చెప్పినా కదిలే మనిషి కాదు ఈ అప్ప, ఇలాంటి వాళ్ళు ఆటలకి పనికిరారని వింటేగా"

సూర్యంకి కోపం తన్నుకు వస్తుంది కానీ అందరి ముందు ఎందుకని అలా చూసి ఊరుకున్నాడు. అయినా గంగాధరం అంటే ముందు నుంచే నచ్చదు సూర్యంకి, 'బడాయి బడుద్దాయి' అంటాడు దేవితో. పైకి సదా మామూలుగావున్నా మాకు ఊర్లో ఇంత ఆస్తి వుంది, తోటలు వున్నాయి, నాకు ఏదైనా వేళ్ళ మీద పని, వాళ్ళు తెలుసు వీళ్ళు తెలుసు, చిరంజీవి మా ఇంటికి వస్తుంటాడని గొప్పలు చెప్పుకోవటం. తనకే అన్నీ తెలుసు అనే పొగరు ఒకటి సూర్యంకి అసలు నచ్చదు.

సూర్య మాట్లాడేలోపే పవన్ "ఏం చేయాలోనని చూస్తున్నా" అంటూ సుజాత వంక చూశాడు, తన మొఖంలో చిన్న కదలిక కూడా లేదు, చూసి మా ఆవిడ ఒప్పుకుంది. నాకు ఓకే" అన్నాడు పవన్ మదన్ తో.

'తన మొఖంలో అంత ఏం కనిపించిందో ఈ తింగరోడీకి' అనుకుని, తను కూడా దేవి కేసి చూశాడు. ఎంతో అభినయంతో ఉండే తన మొఖంలో కూడా చిన్న కదలిక లేదు..

ఆలోచనలో పడ్డాడు. ఇంక తన నిర్ణయమని తన దేవి వైపు సరేనా? అని కళ్ళతో మౌనలేఖ రాశాడు. "ఏంటి ఆలోచిస్తున్నారు మీకు ఇష్టం లేకపోతే వద్దులెండి" అన్నారు రవి గారు.

"మీకు తెలియనిది ఏముంది. రవి గారు ఉన్నట్టుండి అనేసరికి తప్పదుగా ఎవరికైనా, ఇల్లు ఎలా పడితే అలా వుంది, ఓ పక్క మా ఆవిడకి ఒంట్లో బాలేదు, ఇప్పుడు అవసరమా? అని తప్ప ఇందులో చేయకపోటానికి ఇబ్బంది కూడా ఏం లేదు. నిజానికి ఐడియా కూడా కొత్తగా వుంది ఒప్పుకోవలసిందే అది మాత్రం, కానీ.." అంటూ సాగతీశాడు.

"అయితే ఆయనని పక్కనెట్టి మనం ఇక్కడి దాకా వచ్చాంగా మనం వెళ్దాం" అన్నాడు గంగాధరం.

ఇంతలో "ఏమైంది దేవి ఒంట్లో బాలేదా మరి చెప్పనేలేదు" అంది సుజాత.

"అదేం లేదు చిన్న నలత అంతే" అంది. మదన్ సూర్యం వంక చూశాడు వీళ్లందరికి సూర్యం తెలివి కొత్తగాని, మదన్ కి కొత్తేం కాదు.

"అదిగో దేవి కి కూడా బానే వుందిగా, నీ అతి తెలివి నా దగ్గర కాదు.. నువు కూడా వున్నావ్" అన్నాడు మదన్.

సూర్యం దేవికి మాత్రమే కనపడే కోపంతో చూశాడు. అందరి ముందు చిన్నతనం ఎందుకని "సరే మీ ఇష్టం, కానీయండి" అన్నాడు సూర్యం.

"అందరూ సిద్దంగా వున్నారుగా, ముందుగా రూల్స్ చెప్తాను, అందరూ కట్టుబడి వుండాలి. ఇందులో అందరి పేర్లు ఉన్నాయి, చీటీలో వచ్చిన ఇంటికి రాత్రి 7 లోపు వెళ్లిపోవాలి, కుదిరితే చీకటి పడేలోపు మళ్ళీ ఫస్ట్ తారీఖు నాడు పొద్దున ఇంటికి వచ్చెయ్యండి, ఆ రోజంతా మా ఇంట్లోనే అందరికీ లంచ్, డిన్నర్ అన్నీ నేను సెట్ చేస్తున్న.

నా ఐడియా నమ్మి వచ్చినందుకు మీ అందరికీ మంచి ట్రీట్ ఇస్తా. ఇకపోతే మీ ఇంట్లో ముఖ్యమైన వస్తువులను లాకర్లో పెట్టుకోండి లేదా అన్నీ ఒక రూమ్లో పెట్టి లాక్ చేయండి. ఇక్కడ ఉన్న వారంతా చోరీ చేసే అవసరం లేదు, ఆస్తిపరంగా కూడా ఉన్న వారే, ఐనా సరే మీ జాగ్రత్త మీది" అంటూ మదన్ చెప్పుకొచ్చాడు.

"ఎవరికైనా తప్పక బాగోకపోతే బయటికి రావచ్చు. ఇంకేమున్నాయి అన్నీ చెప్పేసా" అనుకుంటా ఆలోచిస్తున్నాడు మదన్ ఇంకా పొడిగిస్తూ..

"రావుగారి గుమాస్తా అందరి ఇంటికి వస్తాడు మీకు ఏం కావాలన్నా తెచ్చి పెడతాడు, వాడు వచ్చినపుడు మీరు అక్కడ లేకపోతే లేదా ఈ రెండు రోజులు ఇంకెక్కడైనా వుండి నాటకాలు వేస్తే వాళ్ళే మన బ్యాచ్ అందరినీ నెలకో వీకెండ్ ట్రిప్ భారం మొత్తం పెట్టు–కోవాలి ముందే చెప్పేస్తున్నాను" అని ఘాటుగా చెప్పాడు మదన్.

సూర్యకి అర్థమైంది అది తన కోసమేనేనని.

"అర్థమైందిగా ఏమైనా ఉంటే అడగండి నేనైతే అన్నీ చెప్పేసాను, మా ఆవిడ కూడా బట్టలు సర్దుకుని ఇక్కడికే వచ్చేస్తుంది ఇటు నుంచి ఇటే వెళ్లిపోతా. మీరు కూడా రెడీ అయితే చీటీలు తీద్దాం" అన్నాడు.

దేవి ఇక లోపలికి వెళ్ళిపోయింది సర్దుకోవాలని. దీనికి ముందే తొందర ఎక్కువ అనుకున్నాడు సూర్య.

"సరే లేటు ఎందుకు తీసేద్దాం కాకపోతే సూర్యంగారి ఇల్లు కదా ఆయనకి మొదటి ఛాన్స్ ఇద్దాం, బాబు సూర్యచంద్ర తీయి" అన్నాడు మదన్.

ఒకొక్కరిగా ముందుకి వచ్చారు, అందరూ చేతిలో పేపరు వుంది. చివరగా మిగిలింది ఆరాముగా తీసుకున్నాడు మదన్..

"ఎదురుచూస్తున్న టైమ్ వచ్చేసింది నా రాజ్యపు జనులారా! ఇక యుద్ధానికి సిద్ధంకండి. మీ చేతిలోఉన్న ఆయుధాలను తెరిచి చూడండి, నువ్వు మాత్రం లాస్ట్ లో ఓపెన్ చేయరా" అన్నాడు మదన్ సూర్యతో..

"ఎందుకు?" అంటూ చూశాడు సూర్య.

"నీలో టెన్షన్ చూద్దామని" అంటూ నవ్వాడు మదన్.

అదేం వినకుండా "పోరా" అని టక్కున తెరిచి చూసేశాడు..

****